క్లుప్తంగా

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: స్థానిక ప్రధాన చౌరస్తాలో మాజీ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి ఆదివారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ క్షీరాభిషేకం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంతో ఈప్రాంత ప్రజలు సర్వస్వం కోల్పోయారని, ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి చుక్కనీరు దక్కని పరిస్థితి నాటి కాంగ్రెస్ హయాంలో నెలకొందని విమర్శించారు. రామగుండం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. కేసీఆర్ కారణంగానే ఈ ప్రాంతానికి నీళ్లు వస్తున్నందుకు రామగుండం ప్రజల తరఫున క్షీరాభిషేకం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆముల నారాయణ, కలవ్వచర్ల కృష్ణవేణి, గోపు అయిలయ్యయాదవ్, నారాయణదాసు మారుతి, చెలకలపల్లి శ్రీనివాస్, అచ్చె వేణు, చల్లా రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న స్నేహితులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. స్నేహితులు ఫ్రెండ్‌షిప్ బాండ్ కట్టుకుని కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించుకున్నారు. కొందరు స్నేహితులు ప్రముఖ దేవాలయాలకు వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. మాజీ ఎంపీపీలు సారయ్యగౌడ్, సంపత్‌యాదవ్, కొట్టె సుజాత, బాలె మల్లీశ్వరి, మాజీ జెడ్పీటీసీలు భాగ్యమ్మ, తిరుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్‌లు రాంచంద్రారెడ్డి, పురుషోత్తం స్నేహితుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న భూమల్ల చందర్

జ్యోతినగర్: రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు భూమల్ల చందర్ వినతిపత్రం అందించారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వినతిపత్రం అందించినట్లు తెలిపారు. సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు కార్మికులకు లాభదాయకమైన జీవో 22ను వెంటనే గెజిట్ చేసి అమలు చేసేలా కృషి చేయాలని కోరినట్లు చెప్పారు. ఐఎన్‌టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ కోటేశ్వరరావు, గోషిక రవి, బొద్దున శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భూభారతిలో సమస్యలు పరిష్కరిస్తాం

జూలపల్లి: మండలంలోని గ్రామాల్లో రైతులు భూభారతిలో సమర్పించిన భూమి సమస్యల పరిష్కార కార్యక్రమం కొనసాగుతోంది. రెవెన్యూ గిర్దావర్ భవానీ ప్రసాద్ ఆదివారం పెద్దాపూర్‌లో పర్యటించి రైతులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు గతంలో భూభారతి గ్రామసభల్లో ఇచ్చిన వినతులను పరిష్కరించేందుకు రైతులతో కలిసి వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న సిబ్బంది

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్ కార్మికుడు మామిడిపల్లి ప్రవీణ్ ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. కాగా వారి కుటుంబానికి రూ.20వేల నగదుతో పాటు 50కిలోల బియ్యాన్ని ఆదివారం సహచర మున్సిపల్ కార్మికులు కార్మికుడి కుటుంబం ఇంటికి వెళ్లి అందజేశారు.

నిత్యావసరాలు అందజేత

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం అమృత కలశాలు పంపిణీ చేశారు. కాలనీలోని దాదాపు 25మంది నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసరాలు అందించారు. సేవాసమితి కన్వీనర్ నూక రమేశ్, సభ్యులు లింగమూర్తి, సుబ్బారావు, మల్లయ్య, మహేందర్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

మూత్రవిసర్జనకు అవస్థలు

- గుంజపడుగు చౌరస్తా, బస్టాప్ ప్రాంతంలో వసతులు కరువు
- సులభ్ కాంప్లెక్స్ లేకపోవడంతో తప్పని తిప్పలు



గుంజపడుగు ప్రధాన చౌరస్తా

మంథనిరూరల్: మంథని మండలం గుంజపడుగు గ్రామంలోని ప్రధాన చౌరస్తా, బస్టాప్ ప్రాంతంలో సులభ్ కాంప్లెక్స్ లేకపోవడంతో ఇటు ప్రయాణికులు, అటు స్థానికులు మూత్రవిసర్జనకు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. అయితే గత ప్రభుత్వంలో సామూహిక మరుగుదొడ్డి మంజూరు కాగా దాన్ని పంచాయతీ సమీపంలో నిర్మించడంతో నిరుపయోగమైందనే వాదనలు వినిపిస్తున్నాయి.

పెద్ద గ్రామపంచాయతీగా..

మంథని మండలంలోనే పెద్ద గ్రామపంచాయతీగా పేరున్న గుంజపడుగు బస్టాప్ ప్రాంతంలో ప్రయాణికులకు కనీస వసతులు లేవు. ఇటీవల మండలంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు సైతం ఆందోళనలు, రిలే దీక్షలు చేపట్టారు. అలాంటి గ్రామంలో మూత్ర విసర్జనకు చోటు లేకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం రాకపోకలు..

ఒకవైపు గోదావరిఖని నగరం.. మరోవైపు మంథని మండల కేంద్రం.. మధ్యలో గుంజపడుగు గ్రామం. నిత్యం గుంజపడుగు నుంచి గోదావరిఖనికి, మంథనికి వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. బస్సులు, ఆటోల కోసం వేచి చూసేవారు, వ్యాపారులు, స్థానికుల అత్యవసరాలకు వసతి కల్పించకపోవడం స్థానిక పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికంగా విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

దుర్గంధం వెదజల్లుతోంది



బస్టాండ్ సమీపంలోనే వైన్‌షాప్ ఉండగా దానికి పర్మిట్ రూం ఏర్పాటు చేశారు. నిత్యం వందలాది మంది అక్కడే మద్యం సేవించి బహిరంగంగానే రోడ్లపక్కనే మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో బస్టాండ్ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. బస్టాండ్ ప్రాంతంలో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి. – ఊదరి తిరుపతి, హోటల్ నిర్వాహకుడు, గుంజపడుగు

అధికారుల దృష్టికి తీసుకెళ్తా

బస్టాండ్ ప్రాంతంలో స్థానికులు, ప్రయాణికుల అత్యవసరాల కోసం సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని పాలకవర్గం తీర్మానం చేసింది. అయితే స్థలం లేకపోవడంతో ప్రధాన చౌరస్తాలోని ఆర్టీసీ స్థలాన్ని కేటాయించాలని ఆర్టీసీ అధికారులకు ప్రతిపాదనలు పంపాం. స్థలం విషయంలో ఆర్టీసీ అధికారులు ఇప్పటివరకు స్పందించలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. – భానుప్రసాద్, సెక్రటరీ, గుంజపడుగు



కాల్వశ్రీరాంపూర్: మండలంలో పెగడపల్లి గ్రామం ఎస్సీకాలనీ 11వ వార్డులో తాగునీటి పైపులైన్ లీకేజీతో తాగునీరు కలుషితం అవుతోందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తాగునీటి పైపులైన్ లీకేజీని అరికట్టాలని వారు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

పైపులైన్ లీకేజీ.. తాగునీరు వృథా

- 17ఏళ్ల క్రితం వేసిన పైపులైన్‌ను ఆధునీకరించాలి: సింగరేణి కార్మికులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికుల ఆరోగ్యం విషయంలో యజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్తోంది. కానీ ఆచరణలో చేపట్టడం లేదని కార్మిక కుటుంబాలు వాపోతున్నాయి. తాగునీటి విషయంలో నిర్లక్ష్యంగా వహించడంపై కార్మిక కుటుంబాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. ఆర్జీ–2 ఏరియా పోతనకాలనీ సింగరేణి క్వార్టర్లకు సింగరేణి ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న తాగునీటి పైపులు పలు ప్రాంతాల్లో లీకేజీ కావడంతో తాగునీరు వృథాగా పోతోంది. అంతేకాకుండా లీకైన చోట పందులు చేరి గుంతలతో బురదగా మారుతోంది. తాగునీరు సరఫరా సమయంలో భూమిలోపల వేసిన పైపుల నుంచి నీరు లీకేజీ అవుతోంది. దీంతో వర్షపు నీటితో పాటు బురద నీరు కలిసి కలుషితమైన తాగునీరు సరఫరా అవుతోందని సింగరేణి కార్మిక కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.



పైపులైన్ లీకేజీ నీటితో ఏర్పడిన గుంత

పైపులైన్‌ను ఆధునీకరించాలి..

2007లో పోతనకాలనీ క్వార్టర్లు నిర్మించిన సమయంలో అప్పటి సింగరేణి యజమాన్యం ఇనుప పైపులతో ఇంటర్ లాక్ పద్ధతిలో తాగునీరు సరఫరా పైపులైన్ ఏర్పాటు చేసింది. దీంతో పోతనకాలనీలోని ఏ ప్రాంతంలోనైనా పైపులైన్ లీకేజీ అయినా మొత్తం పోతనకాలనీలో నీటి సరఫరాకు ఆటంకం కలుగుతుంది. 17ఏళ్లు గడిచినా పైపులైన్‌ను ఆధునీకరించక పోవడంతో పాటు ఇక్కడ ఉన్న క్వార్టర్లకు మిషన్ భగీరథ తాగునీరు సరఫరా లేకపోడంతో సింగరేణి వారు అందించే గోదావరి నది నీరుపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని కార్మికులు వాపోతున్నారు. ఇప్పటి కైనా ఆర్జీ–2 ఏరియా సింగరేణి యజమాన్యం, సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి పైపులైన్ లీకేజీ కాకుండా మరమ్మతు చేపట్టి పైపులైన్ వ్యవస్థను ఆధునీకరించాలని పోతన కాలనీవాసులు కోరుతున్నారు.



పైపులైన్ లీకేజీ ప్రాంతంలో పందుల స్వైరవిహారం

కలుషిత నీరు సరఫరా



ఆర్జీ–2 సింగరేణి యజమాన్యం పోతనకాలనీలోని కార్మికుల కుటుంబాలకు అందిస్తున్న గోదావరి నీరు పైపులైన్ లీకేజీలతో కలుషితం అవుతోంది. అదే నీటిని సరఫరా చేస్తున్నారు. సింగరేణి యజమాన్యం పట్టించుకొని పైపులైన్ లీకేజీ కాకుండా తగు చర్యలు చేపట్టాలి. – వెంకటేశ్వర్లు, సింగరేణి కార్మికుడు, పోతనకాలనీ

మరమ్మతు చేపడతాం

ఆర్జీ–2 ఏరియా పోతనకాలనీ క్వార్టర్లు నిర్మించిన సమయంలో దాదాపు 17 సంవత్సరాల కిందట వేసిన ఇనుప పైపులు కావడంతో అవి తుప్పు పట్టి ఉండడంతో లీకేజీలు ఏర్పడుతున్నాయి. త్వరలోనే లీకేజీ అయిన ప్రాంతాల్లో పైపులైన్‌కు మరమ్మతు పనులు నిర్వహిస్తాం. సింగరేణి కార్మికులకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం. – హరీశ్, ఆర్జీ–2 సివిల్ సూపర్‌వైజర్

సంక్షిప్త వార్తలు

• బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

పాలకుర్తి: రామగుండం నియోజకవర్గం పరిధిలోని అంతర్గాంలో ఆదివారం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు హాజరైన నేపథ్యంలో పాలకుర్తి మండల పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులను బసంత్ నగర్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, మాజీ సర్పంచులు గోంద్ర చందర్, కోల లత, పున్నం సాగర్, కొప్పు రాజేశం, చింతకింది సత్యనారాయణను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

• ఇద్దరి నేత్రాలు దానం

పాలకుర్తి: బసంత్‌నగర్‌కు చెందిన ఆడెపు ఓదెమ్మ (76), కన్నాల శాలపల్లికి చెందిన వెగ్గిలపు గౌరమ్మ నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఓదెమ్మ, గౌరమ్మలు ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సదాశయ ఫౌండేషన్ మండల అధ్యక్షుడు పృథ్వీరాజ్ కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారం మేరకు ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి చెందిన ప్రదీప్ నాయక్ వారి నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు పంపించారు. కుటుంబ సభ్యులను ఫౌండేషన్ సభ్యులతో పాటు స్థానికులు అభినందించారు.

• ఆయన కళ్లు సజీవం

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తీగల నరేశ్ గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సదాశయ ఫౌండేషన్ సభ్యులు, గ్రామ మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు నేత్రదానంపై అవగాహన కల్పించగా మృతుడి కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి భీష్మాచారి ఆధ్వర్యంలో మృతుడి కార్నియాలు సేకరించి హైదరాబాద్ ఐబ్యాంకుకు పంపించారు. ఫౌండేషన్ మండల కన్వీనర్ గార్ల తిరుపతి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పాదయాత్రలో రామగుండం ఎమ్మెల్యే



పాదయాత్రలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్‌లో ఆదివారం జరిగిన కాంగ్రెస్ జనహిత పాదయాత్రలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు నాగలి బహూకరించి స్వాగతం పలికారు. నాయకులు దీటి బాలరాజు, ఉరిమెట్ల రాజలింగం, మోహిద్ సన్నీ పాల్గొన్నారు.

గురువుకు సన్మానం

రామగుండం: స్నేహితుల దినోత్సవం సందర్భంగా రామగుండం జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్ 1986–87 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు త మ గురువు శంకరయ్యను సన్మానించారు. రామగుండంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయనను సన్మానించారు. పోచం, బాబు, హఫీజోద్దీన్, సత్యనారాయణ, రవీందర్‌రావు, శేషు, మొయినొద్దీన్, ఉప్పల్‌రావు, హేమంత్‌కృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.



ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి

రామగిరి: రాష్ట్ర ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యమకారులకు న్యాయం చేయాలని ఉత్తర ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ బత్తుల శంకర్ కోరారు. ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, త్వరలోనే ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు శంకర్ తెలిపారు.

గల్ఫ్‌లో చిక్కుకున్న ముస్లిం మహిళ క్షేమంగా ఇంటికి



కేటీఆర్‌కు రాఖీ కడుతున్న మహిళ

గోదావరిఖని: బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లి అక్కడే చిక్కుకున్న ముస్లిం మహిళను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో క్షేమంగా రామగుండం తీసుకువచ్చారు. హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆ మహిళ ఆదివారం కేటీఆర్‌ను కలిసి రాఖీ కట్టింది. బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రెడ్డి చొరవ, కేటీఆర్ సహకారంతో సొంత ప్రాంతానికి చేరుకుంది.

కార్మిక హక్కుల కోసం రాజీలేని పోరాటం

ఎలిగేడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీపెల్లి రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని శివాలయం వద్ద గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ 4వ మహాసభ నిర్వహించారు.

నూతన కమిటీ ఎన్నిక

మండల కేంద్రంలో సమావేశమైన గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడిగా తీట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఇరుగురాల సరీన్, కోశాధికారిగా కవ్వంపల్లి దేవేందర్, ఉపాధ్యక్షులుగా రాయపాక లక్ష్మన్, నర్సయ్య, చంద్రయ్య, రమేశ్, కమిటీ సభ్యులుగా మల్లేశ్, నర్సయ్య, నర్సయ్య, సుజాత, లచ్చయ్య, మల్లయ్య, రవీందర్, రమేశ్ పాల్గొన్నారు.

పాండవుల గుట్టపై నెమలి మృతి

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ పాండవుల గుట్టపై ఆదివారం నెమలి మృత కళేబరాన్ని పశువుల కాపర్లు గుర్తించారు. పంట పొలాలకు రసాయన మందులు చల్లిన నీళ్లు తాగాయా, ఎవరైనా వేటగాళ్లు మత్తు గుళికలు ఎరగా వేశారా అనేది తెలియాల్సి ఉంది. పాండవుల గుట్టపై అటవీ అధికారులు నిఘా ఉంచాలని గ్రామస్తులు కోరారు.

కేవీకే శాస్త్రవేత్త వినోద్‌కుమార్‌కు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న వినోద్‌కుమార్

రామగిరి: రామగిరి ఖిల్లా కృషివిజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త డా.తాటికొండ వినోద్ కుమార్ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం ఆదివారం యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, భారత వ్యవసాయ పరిశోధనా మండలి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంజీత్ లాల్ జెట్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ అల్దస్ జానయ్య చేతుల మీదుగా వినోద్‌కుమార్ పురస్కారం అందుకున్నారు.

సింగరేణి వార్తలు

అందుబాటులోకి సూపర్‌స్పెషాలిటీ వైద్యం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

గోదావరిఖని: సింగరేణి ఉద్యోగుల కుటుంబాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఆదివారం కేర్ ఆసుపత్రికి చెందిన సూపర్ స్పెషాలిటీ వైద్యులతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ సీఎండీ ఆదేశాల మేరకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్డియాలాజీ, న్యూరాలజీ, మెడికల్ గ్యాస్ట్రోలజీ, యూరాలజీ వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 400 సింగరేణి ఉద్యోగుల కుటుంబాలు పాల్గొని పరీక్షించుకున్నట్లు సింగరేణి అధికారులు వెల్లడించారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రెఫల్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం ఆంజనేయప్రసాద్, ఏసీఎంఓ డాక్టర్ అంబిక, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వేణు, సీనియర్ పీవోలు శ్రీనివాస్, ఫిరోజ్‌ఖాన్, కేర్ ఆసుపత్రి వైద్య బృందం పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: మేడ్చల్ జిల్లాలో ఈనెల 19 నుంచి 22వరకు జరిగే సీపీఐ రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం కోరారు. స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో ఆదివారం జరిగిన నగర సమితి సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్‌కుమార్, నాయకులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, కె.కనకరాజ్, మద్దె ఎల్లాగౌడ్, ఆరెల్లి పోషం, రేణికుంట్ల ప్రీతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శిగా ఎంపికైన తాండ్ర సదానందంను సన్మానించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: స్థానిక మార్కండేయకాలనీలోని గౌతమి సాయి డిగ్రీ కళాశాలలో 17 ఏళ్ల క్రితం ఎంపీసీఎస్ గ్రూప్ చదివిన పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఇందిరానగర్‌లోని ఆద్య బాంకెట్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం, స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆటపాటలతో ఆనందంగా స్టెప్పులేశారు. అందరూ కలిసి ఒకేచోట భోజనం చేశారు. పూర్వ విద్యార్థులు మధుకర్ పబ్బా, రాజ్‌కుమార్, శ్వేత, శ్రీనివాస్, కాదాశి శేఖర్, సుధీర్, సతీశ్, నాగరాజు పాల్గొన్నారు.

ఇందిరమ్మకాలనీ సమస్యలు పరిష్కరించండి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీ సమస్యలు కార్పొరేషన్ అధికారులు పరిష్కరించాలని సీపీఎం రెండో డివిజన్‌శాఖ కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీలో ఆదివారం వారు క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మకాలనీ ఏర్పడి 18ఏళ్లు కావస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదని ఆరోపించారు. పూర్తిస్థాయిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, రోడ్లు నిర్మించి మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం.రామాచారి, జిల్లా కమిటీ మెంబర్ బిక్షపతి, పార్టీ సభ్యులు రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తూముకు గేటు ఏర్పాటు చేయాలి

జూలపల్లి: మండంలోని పెద్దాపూర్ పెద్ద చెరువు నక్కల గండి తూముకు గేటు లేక నీరు వృథాగా పోతోందని, గేటు పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని పెద్దాపూర్ పెద్ద చెరువు సాగునీటి సంఘం మాజీ చైర్మన్‌తో పాటు రైతులు కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ వర్షాలు లేక చెరువులోకి నీరు రాలేదని, ఉన్న నీరు తూముకు గేటు లేక వృథా పోతోందని వాపోయారు. అధికారులు స్పందించి వెంటనే గేటు ఏర్పాటు చేయాలని కోరారు.